క్లుప్తంగా

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏవో మధుసూదన్

గూడెంకొత్తవీధి: ప్రతిరైతు ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని ఏవో మధుసూదన్ తెలిపారు. దచ్చరిపాలెంలో ఈ క్రాప్ నమోదును మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరికైనా ఈ విషయంలో ఇబ్బందులుంటే నేరుగా ఆర్‌బీకేలను సందర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రింతాడ ఆర్‌బీకే వ్యవసా సహాయకులు సంగీత పాల్గొన్నారు.

చంద్రబాబు అవినీతిపై సమాధానం చెప్పాలి



ఎంపీపీ అనూషాదేవి

చింతపల్లి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అవినీతి, కుంభకోణాలపై తెలుగుదేశం నాయకులు సమాధానం చెప్పాలని ఎంపీపీ కోరాబు అనూషా దేవి డిమాండ్ చేశారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఐటీ నోటీసులపై చంద్రబాబు ఎందుకు స్పందించడం లేదో టీడీపీ నాయకులు ప్రజలకు చెప్పాలన్నారు. అమరావతిలో సబ్ కాంట్రాక్టర్ల వద్ద రూ.118 కోట్లను లంచాల రూపంలో చంద్రబాబు తీసుకున్నారని ఆమె విమర్శించారు.

నేడు ధారకొండలో గడప గడపకు...

గూడకంకొత్తవీధి: ధారకొండ సచివాలయం పరిధిలోని 12 గ్రామాల్లో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. పెట్రాయి,పెద్ద గంగవరం నుంచి ఏనుగుబయలు, ధారకొండ వరకు ఉన్న గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు పేర్కొంది.

వ్యవసాయంపై క్షేత్రస్థాయిలో అవగాహన అవసరం



పూల సాగును పరిశీలిస్తున్న విద్యార్థులు

చింతపల్లిరూరల్: విద్యార్థులకు వ్యవసాయంపై క్షేత్రస్థాయిలో అవగాహన ఉండాలని స్థానిక ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త సందీప్ నాయక్ తెలిపారు. వ్యవసాయ పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రాక్టికల్స్‌లో భాగంగా మండలంలోని చౌడుపల్లిలో అభ్యుదయ రైతు కంఠ రమణ భూమిలో మంగళవారం బంతిపూలు, కూరగాయాల సాగు, ఖర్చు, ఉత్తమ ఉత్పత్తి సాధించడానికి మెలకువలు,మార్కెటింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ టీచింగ్ అసోసియేట్‌లు జీని,అనూష,హార్టీకల్చర్ రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల ధర్నా

రాజవొమ్మంగి/మారేడుమిల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరతూ రాజవొమ్మంగి, మారేడుమిల్లిలో వెలుగు కార్యాలయాల వద్ద మంగళవారం వీవోఏలు ఆందోళన చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయిలు చెల్లించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు.

నేడు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల పర్యటన

వై.రామవరం: ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత సత్య ఉదయ్ భాస్కర్(అనంతబాబు) బుధవారం మండలంలో పర్యటించనున్నట్టు ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లు పంపిణీ చేస్తారని చెప్పారు.

గురుభ్యోనమః

జిల్లాలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సత్కరించారు.



రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

- జిల్లాలోని అన్ని పాఠశాలల్లో గురుపూజోత్సవం
- సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళి
- పలువురు ఉపాధ్యాయులకు సన్మానం



గేదలబంద ఎంపీపీ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు



వనుగుమ్మలో విద్యార్థులకు పలకలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి



అరకులోయ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ చలపతిరావును సన్మానిస్తున్న విద్యార్థులు



అనంతగిరిలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న హెచ్ఎం మంగమ్మ



డుంబ్రిగుడ కేజీబీవీలో ఉపాధ్యాయిని కృష్ణకుమారిని సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు



ఎటపాకలో ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న అధికారులు,ప్రజాప్రతినిధులు

ముంచంగిపుట్టు: మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. వనుగుమ్మలో వైస్ ఎంపీపీ భాగ్యవతి విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు. జర్రెల సర్పంచ్ భాగ్యవతి మండలంలో కేంద్రంలో బాలిక పాఠశాల-1లో ఉపాధ్యాయులకు డైరీలు, పెన్నులు పంపిణీ చేశారు.

పెదబయలు: మండలంలో అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

అరకులోయ రూరల్: మండలంలోని పలు పాఠశాలలు, కళాశాలలో మంగళవారం ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పట్టాసీ చలపతిరావును విద్యార్థులు సన్మానించారు.

అనంతగిరి: మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బాలిక-2 పాఠశాలలో హెచ్ఎం మంగమ్మ ఆధ్వర్యంలోని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డముకు ఎంపీపీ పాఠశాలలోని మాతృభూమి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు లీలావతి, మంజునాథ్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలోని ఈశ్వర్ ప్రసాద్, కృష్ణంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయురాలు కృష్ణకుమారి, హెచ్ఎం విలియంకేరీని యూటీఎఫ్ నాయకులు సుబ్బారావు,చంద్రశేఖర్ తదితరులు సత్కరించారు. గేదలబంద ఎంపీపీ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పీతల సుజాత,సుబ్బారావు, చంద్రశేఖర్,ఎంఈవో సుందరరావు,ధర్మ,నాగేశ్వరారవు తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: గూడెం కాలనీలోని ఉపాధ్యాయులను జీపీఎస్ టీడబ్ల్యూ పాఠశాలలో యువకులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు సేవా రాజారావు, ముక్కలి కామేశ్వరరావు,కొర్రా మల్లేశ్వరరావు, నాడెలి రవి, జోరంగి సురేష్‌లను సన్మానించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

జి.మాడుగుల: మండలంలోని పలు పాఠశాలలు, కళాశాలలో మంగళవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రావును విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

చింతపల్లి: మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో ఎంఈవోలు ప్రసాద్, బోడెం నాయడు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని తెలిపారు. పలు పాఠశాలలో విద్యార్థులు వివిధ వేషాధారణలతో ఆకట్టుకున్నారు.

కొయ్యూరు: గురుపూజోత్సవం సందర్భంగా మండలంలోని ఏడుగురు ఉత్తమ ఉపాధ్యాయులను మంగళవారం స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాల-1లో ఎంఈవో ఎల్.రాంబాబు ఘనంగా సన్మానించారు. చిట్టింపాడు స్కూల్ కాంప్లెక్స్ కొండసంతకు చెందిన కె.వాసంతి, కొమ్మిక కాంప్లెక్స్ ఆడాకులకు చెందిన ఎస్.సత్తిబాబు, వైస్ పాకల కాంప్లెక్స్ తాటిమనిపాలెంకు పాఠశాల నుంచి కె.లక్ష్మణరావు, రావణాపల్లి జీపీ నుంచి ఎస్. వెంకటరావు,కొయ్యూరు కాంప్లెక్స్ చీడిపాలెం పాఠశాలకు చెందిన ఎల్‌వీవీ సత్యవతి,రామరాజుపాలెంకు చెందిన టి.లక్ష్మి, యూ.చీడిపాలెంకు చెందిన గొర్లె బాలకృష్ణ, ఆర్. నిమ్మలపాలెంకు చెందిన ఆర్. భాస్కర్‌లను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి, సన్మానించారు.

గంగవరం: సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుడి పాత్ర ఎంతో కీలకమని, అటువంటి వృత్తిలో ఉన్న అందరూ ధన్యులని ఎంపీపీ పల్లాలకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీ రత్నం అన్నారు. మంగళవారం యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక విద్యా వనరుల కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులు ఆర్.వి.వి.సత్యనారాయణ, దుర్గాదేవి, పి.వెంకటరమణ, కోసు శ్రీనివాస్, చిన్న శ్రీనివాస దొరలకు మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రదానం చేసి, సత్కరించారు. ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, తహసీల్దార్ శ్రీమనారాయణ, ఎంపీడీవో బి.శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ-2 కుంజం గంగాదేవి, సర్పంచ్ అక్కమ్మ, ఎంఈవో మల్లేశ్వరరావు, యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు కొమరం రఘుబాబు దొర, జిల్లా కోశాధికారి కె.కృష్ణ, కార్యదర్శి సీహెచ్ రాంబాబు, మహిళా అధ్యక్షురాలు రుక్మిణీదేవి పాల్గొన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కృష్ణ , స్థానిక ఆశ్రమ పాఠశాలలో హెచ్ఎం ఝాన్సీ హేన్సన్, టేకులవీధి, వేములోవ ఆశ్రమపాఠశాల్లో హెచ్ఎం నాగేశ్వరరావు, గీతాంజలి ఆధ్వర్యంలో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాల్లో విద్యార్థులు ఉపాధ్యాయ వేషధారణలో పాఠాలు బోధించి అందరినీ ఆకట్టుకున్నారు.

రాజవొమ్మంగి: మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీఅల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన గురుపూజోత్సవంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొని మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోర్నగూడెం, సింగంపల్లి, రాజవొమ్మంగి ఆశ్రమోన్నత పాఠశాలల్లో, స్థానిక గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఎటపాక: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎటపాకలోని మండల విద్యావనరుల కేంద్రంలో పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ పృథ్వీ,జెడ్పీటీసీ ఉబ్బా సుస్మిత,ఎంపీపీ కాక కామేశ్వరి,ఎంఈవోలు సరియం రాజులు,నీలి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ హెచ్‌ఎంలకు సన్మానం

పాడేరు రూరల్ : టీచర్స్ డే ను పురస్కరించుకుని ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తూ 2024 సంవత్సరంలో పదవీవిరమణ చేయనున్న పలువురి ప్రధానోపాధ్యాయులను మంగళవారం పట్టణంలోని తలారిసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలోని ఇండోర్ స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానించారు. పలు పాఠశాలల్లో పనిచేస్తున్న సీనియర్ హెచ్‌ఎంలు రీమలి జాన్, పి.బుల్లయ్య, పండునాయుడు,లక్ష్మణుడు, గణేష్, కేశవరావు, కె.వి.రమణ, గణపతిరాజులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ, సంఘం రాష్ట్ర శాఖ ప్రతినిధులు పి. కృష్ణారావు, అర్జున్, జీవీవీ ప్రసాద్, నాగభూషణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాతీ నిర్మాణంలో గురువులది కీలక పాత్ర

రంపచోడవరం: జాతి నిర్మాణంలో గురువుల పాత్ర కీలకమని స్థానిక సర్పంచ్ మంగా బొజ్జయ్య అన్నారు. రంపచోడవరం పంచాయతీ కార్యాలయంలో జరిగిన గురుపూజోత్సవంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రంపచోడవరం ఎంఆర్‌సీలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈవో ఎం.సత్యనారాయణదొర ఆధ్వర్యంలో మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. రంపచోడవరం అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ దోమలపాటి సుధాకర్, ఏవో టి.కన్నపరాజు, ఉపాధ్యాయులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వై.రామవరం: స్థానిక గిరిజనసంక్షేమ ఆశ్రమ పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఎనిమిదిమంది ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేశారు. వి.నాగమణి, ఎల్.రాజబా బు, బలరామ మూర్తి, ఎల్.బాబురావు, ఆర్.రామకృష్ణారెడ్డి, ఎస్. జ్యోత్స్న, సూర్యప్రకాశ రావు, పాపన్నదొర ఈ పురస్కారాలు అందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను యూటీఎఫ్ నేతలు నెరం వెంకటరావు, పల్లాల లక్ష్మణరెడ్డి, పల్లాల గంగధరరెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ పల్లాల బాలురెడ్డి, ఎస్‌బీఐ మేనేజర్ యు.నాగరాజు సన్మానించారు. అనంత రం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కూనవరం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక హైస్కూల్‌లో ఉపాధ్యాయులను హైస్కూల్ పీఎంసీ చైర్మన్ పత్తిపాటి శ్రీను,వైస్ చైర్మన్ మోత్కూరి జయమ్మ తదితరులు ఘనంగా సన్మానించారు. హెచ్ఎం సీహెచ్.అప్పారావు, ఉపాధ్యాయులు అరుణ,రాజేశ్వరి,రత్తయ్య పాల్గొన్నారు.



గూడెంకాలనీలో గురువులను సన్మానిస్తున్న యువకులు



జి.మాడుగుల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ వేణుగోపాలరావును సన్మానిస్తున్న విద్యార్థులు



చింతపల్లిలో ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు



కొయ్యూరులో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవో రాంబాబు



గంగవరంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపీపీ పల్లాలకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీ రత్నం



పాడేరులో సన్మానం పొందిన హెచ్‌ఎంలతో ప్రతినిధులు



రంపచోడవరం ఎంఆర్‌సీలో ఉపాధ్యాయులకు సన్మానం



వై.రామవరం ఆశ్రమ పాఠశాలలో పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులు



కూనవరం హైస్కూల్ హెచ్ఎం అప్పారావును సన్మానిస్తున్న నేతలు

నేత్రదానంపై అందరికీ అవగాహన అవసరం



పెదబయలులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



పిడతమామిడి గ్రామంలో నేత్రదానంపై నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

పెదబయలు: నేత్రదానంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సిందూరం పడాల్ అన్నారు. 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా మంగళవారం పెదబయలు పీహెచ్‌సీ నుంచి అంబేడ్కర్ కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మరణించిన ఆరు గంటల వ్యవధిలో ఎవరైన కళ్లను దానం చేయవచ్చని చెప్పారు.

ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ పార్వతమ్మ, ఆప్తమాలజిస్ట్ కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిడతమామిడిలో అవగాహన ర్యాలీ

గంగవరం : ప్రతి ఒక్కరూ విధిగా నేత్రదానం చేయాలని పిడతమామిడి పీహెచ్‌సీ వైద్యాధికారులు ఈట సాయి రతన్,ఈట నిహిత అన్నారు. 38వ నేత్రదాన పక్షోత్సవాలల్లో భాగంగా ఆప్తాల్మిక్ అధికారి అ.ఏసుపాదం ఆధ్వర్యంలో పిడతమామిడి గ్రామంలో మంగళవారం ర్యాలీ నిర్వహించి, నేత్రదానం పై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది వీర్రాజు, శ్రీను, ఆశ వర్కర్లు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



బొయితిలి అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సర్పంచ్ మాలన్న

జి.మాడుగుల: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని బొయితిలి సర్పంచ్ మాలన్న తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గల బొయితిలి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. పోషక విలువలు గల ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, రాగులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోను, ఇళ్లవద్ద విరివిగా లభించే పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి సమష్టిగా పనిచేయాలి



రామన్నదొర, రామకృష్ణదొరలను సన్మానిస్తున్న గృహసారథులు

రంపచోడవరం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని భారీ మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని రంపచోడవరం మండల సచివాలయ కన్వీనర్ పండా రామకృష్ణదొర అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంగళవారం సచివాలయ కన్వీనర్లు ,గృహసారథులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మండల పార్టీ కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర, మండల సచివాలయం కన్వీనర్ పండా రామకృష్ణదొరలను ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో రామకృష్ణదొర మాట్లాడుతూ ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న రాంబాబు, మత్స్యకొండంనాయుడు

జి.మాడుగుల: మండలంలో జి.మాడుగుల పంచాయతీ కరకపల్లిలో గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ కిముడు రాంబాబు,వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పాలమామిడి సర్పంచ్ సురభంగి రామకృష్ణ, ఎంపీటీసీలు గబ్బాడి సన్యాసిదొర,చిన్నారావు, ఈశ్వరరావు మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగూరుబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు పాంగి రామ్మృకృష్ణ,సంగర్బ సచివాలయ కన్వీనర్ సూర్యప్రకాష్‌నాయుడు, వార్డు సభ్యుడు తిరుపతిరావు పాల్గొన్నారు.

గిరిజనేతరులకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాల జారీపై విచారణ చేయాలి



గిరిజనేతరులకు జారీచేసిన కులధ్రువీకరణ పత్రాలు చూపిస్తున్న నాయకులు

అరకులోయ రూరల్: గిరిజనేతరులకు ఎస్టీ కులధ్రువీకరణ పత్రాల జారీపై విచారణ చేయాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ కోరారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెదలబుడు పంచాయతీ సచివాలయం-1 పరిధిలో అరకులోయ టౌన్ కొండవీధి కాలనీలో నివాసం ఉంటున్న బీసీ-డి(కాపు సామాజిక వర్గం)కి చెందిన గిరిజనేతరుడు పిట్టల రాంబాబు కొద్ది రోజుల కిందట ఎస్టీ భగత కులధ్రువీకరణ పత్రం పొందారన్నారు. మైదాన ప్రాంతాల నుంచి నుంచి వలస వచ్చిన గిరిజనేతరులు అక్రమంగా ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నారని చెప్పారు. ఇలా ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు హరి, జగన్నాథం, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన బాలికకు కేజీహెచ్‌లో వైద్యం

- బాధితుల ఫోన్‌తో స్పందించిన జి.మాడుగుల జెడ్పీటీసీ



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలిక

గూడెంకొత్తవీధి: కాలికి గాయమైన ఓ గిరిజన బాలికకు కేజీహెచ్‌లో సకాలంలో వైద్యం అందేలా వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జి.మాడుగుల జెడ్పీపీటీసీ మత్స్యరాస వెంకటలక్ష్మి చర్యలు తీసుకున్నారు. సోమవారం సాయంత్రం గూడెంకొత్తవీధి మండలంలోని మారుమూల ప్రాంతమైన జి.కొత్తపాలెంకి చెందిన బాధితులు జెడ్పీటీసీకి ఫోన్ చేశారు. తమ పాప కొర్రా లక్ష్మి(6) కాలుకి గాయంకావడంతో కేజీహెచ్‌కు వచ్చామని, ఇక్కడ ఎవరూ తెలియదని చెప్పడంతో ఆమె వెంటనే స్పందించి ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడారు. బాలికకు మెరుగైన చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నారు. బాలిక కుటుంబానికి కొంత నగదు అందజేశారు.